ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంధంగూడ గ్రామస్తులు

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధి గంధంగూడలోని ప్రభుత్వ స్థలం పూర్తిగా అన్యాక్రాంతం అవుతుందని మండల తహశీల్దార్‌కు లిఖితపూర్వకంగా స్థానికులు ఫిర్యాదు చేశారు. హరీష్, రాంప్రసాద్, రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహశీల్దార్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 97తో పాటు 81, 62, 65లలో ప్రభుత్వ భూమి ఉందని, దాదాపు ఈ భూమిని అక్రమార్కులు కబ్జా చేస్తే అన్యాక్రాంతం అయిపోతుందన్నారు. అనేక అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ స్థలం కనిపించకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన ఆదేశాలతో మండల ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి హద్దులు వేయాలని కోరారు. సర్వే చేపట్టి ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసి చుట్టూ కంచె వేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారని వారు తెలిపారు.

కేన్సర్ రోగులకు మనోధైర్యం ఇవ్వాలి


నార్సింగి సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు

మణికొండ: కేన్సర్‌ను మొదటిదశలోనే గుర్తిస్తే నియంత్రణతో పాటు పూర్తిగా నయం చేసుకోవచ్చని ఈ విషయాన్ని వారందరికీ తెలియజేసి మనోధైర్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్వాడ్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ నాగ నందిగాం అన్నారు. శుక్రవారం నార్సింగిలోని సైకిల్‌ట్రాక్‌లో కేన్సర్‌పై అవగాహన నిర్వహిస్తూ.. 10 కిలోమీటర్ల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం, ధూమపానం, పొగాకు, మద్యం సేవించటం ఎక్కువ కావటంతో కేన్సర్ వస్తుందని, వాటిని పూర్తిగా మానేయడంతో పాటు కేన్సర్ రోగులకు అండగా నిలవాలన్నారు. సంస్థ ఈడీ తేజేష్, తరుణ్, వేదాంత్, నాగేశ్వర్‌రావుతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్టాండ్ ఎక్కడ?


బస్టాండ్ లేక రోడ్డుపైనే మలుపు తిరుగుతున్న ఆర్టీసీ బస్సులు

- కనుమరుగైన చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్
- భవనాన్ని కూల్చివేసిన జీహెచ్‌ఎంసీ
- ఆరేళ్లుగా ప్రయాణికుల ఇబ్బందులు

చార్మినార్: పాతబస్తీలోని చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల ప్రయాణికులకు ఈ స్టేషన్ ప్రధానంగా ఉండేది. అయితే, ఇక్కడ మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తామంటూ జీహెచ్‌ఎంసీ అధికారులు పాత భవన సముదాయాన్ని 2018లో కూల్చివేశారు. ఆరేళ్లు గడుస్తున్నా ఇక్కడ ఎలాంటి నిర్మాణం చేయలేదు.

> చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ లేక పాతబస్తీ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లుగా ఇక్కడ కొనసాగిన బస్టాండ్‌ను కూల్చివేయడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయని జీహెచ్‌ఎంసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చార్మినార్ వద్దే..

30 ఏళ్ల క్రితం చార్మినార్ కట్టడం వద్దే చార్మినార్ బస్‌స్టేషన్ కొనసాగింది. అయితే, 1989లో సీపీపీ (చార్మినార్ పెడస్ట్రియన్ ప్రాజెక్టు) పనుల కోసం అక్కడి నుంచి పంచ్ మోహల్లాకు తరలించారు. అంతకు ముందు ఇక్కడ పంచ్ మోహల్లా డిపో ఉండేది. ఈ క్రమంలో 2005లో చార్మినార్ బస్‌స్టేషన్ ఇక్కడి నుంచి తరలించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అయితే, తరలింపుపై స్థానికులు, వ్యాపారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేశారు. అంతేకాకుండా 2006లో బస్టాండ్ యథాస్థానంలో ఉండాలంటూ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పంచ్‌మోహల్లాలోనే చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్ కొనసాగాలంటూ 2007లో కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఎట్టి పరిస్థితుల్లో తరలించరాదని ఆర్టీసీ అధికారులను 2008లో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సైతం కోరారు. అప్పటి నుంచి చార్మినార్ బస్టాండ్ అక్కడే కొనసాగింది. కాగా, 2018 జనవరి 24వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో భవనాన్ని తొలగించడంతో చార్మినార్‌లో ఆర్టీసీ బస్సులను నిలపడానికి ఎలాంటి బస్టాండ్ లేకుండాపోయింది.

ఆరేళ్లుగా రోడ్డుపైనే..

మల్టీ లెవల్ పార్కింగ్ కోసం చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ తొలగించి ఆరేళ్లు గడిచినా ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి నిర్మాణ పనులు ప్రారంభించ లేదు. ప్రస్తుతం ఇక్కడ తాత్కాలిక పార్కింగ్ కొనసాగుతోంది. చార్మినార్ ప్రధాన రోడ్డుపైనే ఒక వైపు బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. బస్సులు తిరగడానికి సరైన స్థలం లేకపోవడంతో రోడ్డు మధ్య నుంచే వాహనాలను తిప్పుతున్నారు డ్రైవర్లు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడూ.. ట్రాఫిక్‌జాం అవుతోంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11కేవీ ఉప్పర్‌పల్లి స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఫోర్ట్ వ్యూ కాలనీ, ఫర్మారెడ్డి హిల్స్, జన చైతన్య కాలనీ, గోల్డెన్‌హెడ్స్, హ్యాపీహోమ్స్ కాలనీ, జలాల్ బాబానగర్, నౌ నంబర్, చింతల్‌మెట్ ఎక్స్ రోడ్డు, వినోద్‌రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంజీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


ప్రొఫెసర్ కేశవరావు

మణికొండ: ఎంజీఐటీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కేశవరావుకు అనంతపూర్‌లోని జేఎన్‌టీయూ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'డెవలప్‌మెంట్ ఆఫ్ ఆప్టిమల్ ఫీచర్ సెలక్షన్ ఫర్ ఎమోషన్ రెకగ్నిషన్ ఫ్రం స్పీచ్ యూసింగ్ మెటా- హీరిస్టికా ఓపీటీమిజషన్ టెక్నిక్స్' అనే అంశంపై ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి పర్యవేక్షణలో పీహెచ్‌డీ డిగ్రీ పూర్తి చేయడంతో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంజీఐటీ అధ్యాపకులు, ప్రిన్సిపాల్ ఆయనను శుక్రవారం అభినందించారు.

బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడిగా రవికుమార్



నియామకపత్రాన్ని అందుకుంటున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన ఆదిరాల రవి కుమార్ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాజేంద్రనగర్ అసెంబ్లీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా రవికుమార్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవీ అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీకి సంబంధించిన నియమ నిబంధనలను పాటిస్తూ.. క్రమశిక్షణతో కొనసాగుతానన్నారు. బాధ్యతలు అప్పగించిన పార్టీ ముఖ్య నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ బంద్ సంపూర్ణం


ఆందోళన చేస్తున్న ,విద్యార్థులు

- పరీక్షలను అడ్డుకున్న ఆందోళన కారులు
- మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం

ఏజీవర్సిటీ: వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల భూములను హైకోర్టుకు ఇవ్వవద్దని దీనికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీఓ 55 ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు శుక్రవారం చేపట్టిన విశ్వవిద్యాలయ బంద్‌కు విజయవంతమైంది. ఉదయం నుంచే విద్యార్థులు హాస్టల్ నుంచి బయటికి వచ్చి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఎదుట బైటాయించి ధర్నా చేశారు. ప్రొఫెసర్లను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. రెండో సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాస్తుండగా.. అడ్డుకున్నారు. జీఓ నంబర్ 55ను వెనక్కి తీసుకునే వరకు 'తరగతులు వద్దు పరీక్షలు వద్దు' అంటూ నినాదాలు చేశారు. వీరికి మద్దతుగా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. అక్కడినుంచి ర్యాలీగా వీసీ భవనాన్ని ముట్టడించారు. హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వ భూమి చాలా ఉందని అందులో నిర్మాణం చేపట్టాలన్నారు. రోడ్డుపైన నడుస్తున్న మెస్ బంద్ చేస్తేనే స్పందించిన ముఖ్యమంత్రి గత 25 రోజులుగా విద్యార్థులు ధర్నా చేస్తున్నా ఎందుకు..? స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఓ 55ను రద్దు చేసేవరకు ఆందోళన విరమించేది లేదన్నారు. విద్యార్థులకు మద్దతుగా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి సత్యమూర్తి, రాజ్‌కుమార్, మూర్తినాయుడు, బాల్‌రాజ్, ప్రభాకర్, విశ్వవిద్యాలయం విద్యార్థి జేఏసీ నాయకులు రాజ్‌కుమార్, శ్రీజా తదితరులు పాల్గొన్నారు.

1.8 కిలోల గంజాయి పట్టివేత

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో జొమాటో డెలివరీ బాయ్ వద్ద 1.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అంజయ్యనగర్‌లో హాస్టల్‌లో నివాసం ఉంటున్న యు.నవీన్(28) జొమాటో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఓటీ పోలీసులు నవీన్ నుంచి రూ.56 వేల విలువ గల 1.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

4 నుంచి 'దస్తకారీ హాత్ సమితి' ఎగ్జిబిషన్

వేదిక కానున్న గచ్చిబౌలి 'నిథమ్'

రాయదుర్గం: హైదరాబాద్ నగరంలో 'దస్తకారీ హాత్ సమితి' ఆధ్వర్యంలో రెండవ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహణకు గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) వేదిక కానుంది. 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుంది. దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు లభిస్తాయి. నిత్యం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఎగ్జిబిషన్‌లో భాగంగా ప్రత్యేక వర్క్‌షాప్‌లు .. 5వ తేదీ మధుబని పెయింటింగ్, బిహార్..6వ తేదీ గోండ్-మధ్యప్రదేశ్, 7వ తేదీ పట్టచిత్ర -ఒడిశా, 8వ తేదీ క్లేవర్క్-న్యూఢిల్లీ, 9వ తేదీ టెర్రకోట ,న్యూఢిల్లీ వారి వర్క్‌షాపులు జరుగుతాయి.

గ్లోబల్ క్లినికల్ హబ్‌గా భారత్

- క్లినికల్ రీసెర్చ్‌లో పురోగతి..
- జనాభాపరంగా క్లినికల్ ట్రయల్స్ పెరగాలి
- ఐఎస్‌సీఆర్ అధ్యక్షులు డా.సనీష్ డేవిస్

సాక్షి, సిటీబ్యూరో: భారత్ వేదికగా అంతర్జాతీయ స్థాయి క్లినికల్ రీసెర్చ్ సేవలను అందించే స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయని 'ఇండియన్ సొసైటీ ఫర్ క్లినికల్ రీసెర్చ్' (ఐఎస్‌సీఆర్) అధ్యక్షులు డా.సనీష్ డేవిస్ తెలిపారు. కానీ క్లినికల్ ట్రయల్స్ మరింతగా పెరగాల్సిన అవసరముందని, జనాభాపరంగా యూఎస్ 25 శాతం, చైనా 7-8 శాతం క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తుంటే భారత్‌లో 3 శాతం మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఐఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని హెచ్ఐసీసీ నోవాటెల్ వేదికగా రెండు రోజుల పాటు కొనసాగే 17వ వార్షిక సదస్సులో దేశంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో క్లినికల్ పరిశోధకులు, వైద్యులు, పరిశోధనా సంస్థలు పాల్గొని పలు అంశాలపై వర్క్‌షాప్, సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా క్లినికల్ ఆపరేషన్స్, ఎథిక్స్-రెగ్యులేటరీ, అకాడమిక్, క్లినికల్ డెవలప్‌మెంట్, ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ వంటి అధునాతన అంశాలపైన విభిన్న అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని డా.సనీష్ డేవిస్ తెలిపారు. ఇతర దేశాల్లో క్లినికల్ ట్రయల్స్‌లో సాధారణంగా పాల్గొంటారని, ఆ సంస్కృతి ఇక్కడ కూడా రావాల్సిన అవసరముందన్నారు. కరోనా అనంతరం వ్యాక్సిన్, డ్రగ్ తయారీలో క్లినికల్ టర్యల్స్ ప్రాధాన్యత మరింత పెరిగిందని ఐఎస్‌సీఆర్ జనరల్ సెక్రటరీ డా.సీమ తెలిపారు.

క్లినికల్ మెథడాలజీపై శిక్షణ..

క్లినికల్ రీసెర్చ్ వైద్య రంగ అభివృద్ధితో పాటు వేల సంఖ్యలో ఉద్యోగాలను అందిస్తుందని ఐఎస్‌సీఆర్ ట్రెజరర్ అనిర్బన్ రాయ్ ఉద్ఘాటించారు. ఒకప్పుడు ట్రయల్స్ కోసం పేషెంట్లు ఆసుపత్రికి రాగా, ప్రస్తుతం ఆసుపత్రులే పేషెంట్ వద్దకు వెళుతున్నాయన్నాయి. 2005లో దాదాపు 100 వరకు క్లినికల్ రిసెర్చర్లు ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య 60 వేలకు చేరిందన్నారు. ఈ రంగంలో భవిష్యత్‌దృష్ట్యా క్లినికల్ మెథడాలజీ పై ఇన్‌స్టిట్యూషన్లో, హాస్పిటల్స్‌లో, యూనివర్సిటీల్లో శిక్షణ అందించడానికి కార్యాచరణ చేపట్టామన్నారు.

'అక్షదీప్' విద్యార్థికి కాంస్య పతకం

జియాగూడ: ఖేల్ ఇండియా రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో అక్షదీప్ కళాశాల విద్యార్థి కాంస్య పతకాన్ని సాధించడం గర్వంగా ఉందని కళాశాల డైరెక్టర్, కరస్పాండెంట్ మహ్మద్ అక్రమ్ అలీ అన్నారు. రెజ్లింగ్ పోటీల్లో బ్రాంజ్, గోల్డ్, రన్నరప్‌గా నిలిచిన నలుగురు విద్యార్థులను శుక్రవారం కళాశాలలో సత్కరించారు. అనంతరం అక్రమ్ అలీ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థి కె.గజానన్ రాష్ట్ర స్థాయిలో కాంస్య పతకం సాధించినట్టు చెప్పారు. స్విట్జర్లాండ్‌లో జరిగిన సుమో రెజ్లింగ్ పోటీల్లో జె.వినాయక్ రాజ్‌సింగ్ బంగారు పతకం సాధించాడన్నారు. న్యూ ఢిల్లీలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్‌లో షేక్ అజీమ్, ఎస్‌జీఎఫ్ న్యూ ఢిల్లీలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో కూడా తనీషా సింగ్ పాల్గొన్నారని తెలిపారు.

సన్మానం



అత్తాపూర్: అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఆదరణ చూపిస్తున్నారని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహా రెడ్డి ఆయనను పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ.. బాధ్యత మరింత పెరిగిందన్నారు. అత్తాపూర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షుడు ఖలీద్, కొండకళ్ల నాగేందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, వనం మధుసూదన్ రెడ్డి, రవీందర్, రత్నం, శ్రీశైలం, శ్రీరాములు తదితరులున్నారు.

రాచూరి రాజశేఖర్‌కు సత్కారం



అత్తాపూర్: రామరాజ్య ప్రశాసన్ దక్షిణ భారత ప్రముఖ్‌గా రాచూరి రాజశేఖర్ నియమితులైన సందర్భంగా లాలా లజపత్‌రాయ్ శక్తి కేంద్రం బీజేపీ నేతలు శుక్రవారం ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దక్షిణ భారత ప్రముఖ్ పదవీ మన తెలంగాణకు చెందిన వ్యక్తికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దుర్గా ప్రసాద్, రఘునందన్, రామమూర్తి, చరణ్, ప్రసాద్, యాదయ్య, రంధీర్‌సింగ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పనుల పర్యవేక్షణ అధికారుల బాధ్యత

గోల్కొండ: అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యత అధికారులపై ఉందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన బల్దియా ఇంజినీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారుల పర్యవేక్షణ లోపిస్తే పనులు సకాలంలో పూర్తి కావన్నారు. అసంపూర్తి పనుల వల్ల స్థానికులకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. గోల్కొండ డివిజన్‌లోని అహ్మద్ కాలనీతో పాటు రేతిగల్లీ, రిసాల బజార్, మోహల్లా గంజ్, టోలిచౌకీ డివిజన్‌లోని తూమ్స్ రోడ్డు, నదీమ్ కాలనీ, రాఘవ కాలనీ తదితర ప్రాంతాల్లోని రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా నానల్‌నగర్ డివిజన్‌లో సైతం పలు రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని అధికారులకు గుర్తుచేశారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌తో దేశాభివృద్ధి

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ దేశాభివృద్ధికి తోడ్పతుందని టోలీచౌకి బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి అన్నారు. ప్రధాని మోడీ పదేళ్ల పాలనలో దేశం సాధించిన విజయాలు, పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ సందర్భంగా శుక్రవారం బీజేపీ నాయకులు గోల్కొండ రిసాల బజార్‌లో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌చారి మాట్లాడుతూ.. ప్రధాని మోడీ దేశాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బి.సాయిబాబాచారి, సురేశ్‌చారి, శివరాజ్, ఎం.దివాకర్‌రెడ్డి, ముఖేశ్ తదితరులున్నారు.

బడ్జెట్ భేష్ : అమర్‌సింగ్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అత్యుత్తమైనదని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద బడుగు వర్గాల వారికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు. ప్రజలకు ఉపయోగపడే రవాణా రంగ అభ్యున్నతికి ఎక్కువ నిధులు కేటాయించడం హర్షణీయమని చెప్పారు. అదేవిధంగా రైతులు, ఇళ్లు లేని నిరుపేదల కోసం వేల కోట్ల రూపాయలు కేటాయించడం బీజేపీ ప్రభుత్వ విధానానికి నిదర్శనమన్నారు.

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యం..

చార్మినార్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని కుంభమేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం ఆయన రికాబ్‌గంజ్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. బడ్జెట్‌పై పాతబస్తీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

ఆ ప్రహరీ దగ్గరే పాట్లు

ట్రాఫిక్ జామ్‌లకు కేరాఫ్ పీజేఆర్ స్టేడియం రోడ్డు

హఫీజ్‌పేట్ : పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వెళ్లే రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం గచ్చిబౌలి, నానకరాంగూడ వైపు వెళ్లే ఐటీ ఉద్యోగులు ప్రధానంగా చందానగర్, గంగారం, మదీనాగూడలకు చెందిన వాహనదారులు పీజేఆర్ స్టేడియం నుంచి శివాజీనగర్ మీదుగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళతారు. కానీ పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే అక్కడ ప్రహరీ గోడ ఉండడంతో ఒకసారి ఒక వాహనం వెళ్లేందుకే అవకాశం ఉంటుంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో లింగంపల్లి అండర్ బ్రిడ్జి నుంచి పీజేఆర్ స్టేడియం వరకు ట్రాఫిక్‌తో నరకయాతన కనబడుతుందని వాహనదారులు వాపోతున్నారు.


చందానగర్ పీజేఆర్ స్టేడియం వద్ద ఇరుకు మారిన రోడ్డు

- పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టాలి
- పీజేఆర్ స్టేడియం ప్రహరీ కొంత మేర జరిపితే రోడ్డు విస్తరణకు అనుకూలంగా ఉంటుంది.
- రోడ్డు చిన్నదిగా మారడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు సైతం గురవుతున్నారు.
- రోడ్డుపై గుంతలతో ద్విచక్ర వాహనదారులు సతమతమవుతున్నారు.
- భారీ వాహనాలు రాకుండా కమాన్ ఏర్పాటు చేసినా, ప్రమాదకరమని తొలగించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది.

అధికారులకు పలుమార్లు విన్నవించాం



చందానగర్ పీజేఆర్ స్టేడియం ప్రహరీ 5 అడుగుల మేర జరిపితే రోడ్డు విస్తరణకు అనుకూలంగా ఉంటుంది. వాహన రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ స్థలం కాబట్టి ప్రహరీని కుదిస్తే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టవచ్చు. గతంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, చందానగర్ ఉప కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించా. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు.
– తాడిబోయిన రామస్వామి యాదవ్, మాజీ కౌన్సిలర్

ఇరుకు రోడ్డుతో ఇబ్బంది



చందానగర్ నుంచి గచ్చిబౌలికి వెళ్లే క్రమంలో పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాం. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు విస్తరణ చేయాలి. – శేఖర్, వాహనదారుడు



పీజేఆర్ స్టేడియం వద్ద ఇరుకుదారిలో వాహనాల రాకపోకలు


చందానగర్ పీజేఆర్ స్టేడియం నుంచి శివాజీనగర్ వద్ద రోడ్డు ఇరుకుగా మారిన దృశ్యం

భర్తతో గొడవపడి భార్య అదృశ్యం


మోతీబాయి (ఫైల్)

మణికొండ: భార్యాభర్తల మధ్య జరిగిన చిన్న గొడవ కారణంగా భార్య ఇంటినుంచి వెళ్లిపోయిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధి పీరంచెరువులో చోటు చేసుకుంది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, బొంరాస్‌పేట్ మండలం, గడ్డమీది తాండాకు చెందిన రాథోడ్ లక్ష్మణ్, మోతీబాయిలు భార్యాభర్తలు. కాగా వారు బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి పీరంచెరువులో నివాసముంటూ.. కూలీ పనులు చేసుకుంటున్నారు. గతనెల 29న ఇద్దరి మధ్య ఇంట్లో చిన్న గొడవ జరిగింది. దీంతో ఆమె మరుసటి రోజు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవటంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభలతీర్థం వేడుకలు



శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో ప్రభల తీర్థం వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ఉదయం కట్టెల పొయ్యిపై మట్టికుండలలో పాయసం తయారీని ఆనందోత్సాహలతో చేసుకున్నారు. వేడుకల్లో భాగంగా పాత పల్లె ఆటలలో సంతోషంగా పాల్గొనడం, వివిధ రకాల వంటలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చందన మాట్లాడుతూ ప్రభల తీర్థం వేడుకలను 2016 నుంచి నిర్వహిస్తున్నామని ఈశ్వరారాధనలో సరోవర్ వాసులు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు.

హిందీ ప్రచార సభ నూతన కార్యవర్గం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ హిందీ ప్రచార సభ నూతన అధ్యక్షుడిగా కె.రాంచందర్, కార్యదర్శిగా ఏకే రాజు ఎన్నికయ్యారు. శుక్రవారం నాంపల్లి స్టేషన్‌రోడ్డులోని హిందీ ప్రచార సభ కార్యాలయంలో ఈమేరకు నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హిందీ ప్రచార సభ సంయుక్త కార్యదర్శిగా కాల్వ సరిత, కోశాధికారి రామ్మోహనాచారి, పరీక్ష సంచాలకుడు మల్లారెడ్డి, ప్రచార సంచాలకుడు శ్యామ్‌సుందర్‌లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్, ప్రధాన కార్యదర్శి గైబువల్లి తదితరులున్నారు.